# ఆర్‌సిఇపి ఎట్టకేలకు బయల్పడ్డ వాస్తవం

**ప్రాంతీయ** సమగ్ర ఆర్థిక భాగస్వామ్యానికి (ఆర్‌సిఇపి) సంబంధించిన నిశ్శబ్దానికి భారత ప్రభుత్వం ఎట్టకేలకు తెరదించింది. కొత్త వాణిజ్యమంత్రి సురేష్ ప్రభు, భాగస్వామ్యంలోని ఇతర దేశాలు కేవలం వస్తువుల వాణిజ్యంపైనే ఆసక్తి చూపుతున్నాయని, సేవల వాణిజ్యంపై వాటికి ఆసక్తి లేదని అన్నాడు. తర్వాత జరిగిన మంత్రివర్గ చర్చల్లో ఆయన ఇండియా సేవల వాణిజ్యంపై కేంద్రీకరిస్తుందన్నాడు. ఆయన అనుకుంటున్న దాని ప్రకారం వస్తువాణిజ్యం, దిగుమతులపై సుంకం తగ్గింపుల విషయంలో ఇండియా అంగీకరించిన అంశాలు, మిగిలిన సభ్యదేశాలన్నింటికి ఆమోద యోగ్యంగా వుంది. వృత్తి నిపుణులు సరిహద్దులు దాటటంతో సహా, సేవల విషయంలో ఇండియాకు సానుకూలత వుంది, ఎందుకంటే శిక్షణపొందిన వృత్తి నిపుణులు చాలామంది ఇక్కడ వున్నారు.

అంతేకాక ఆర్సెప్ సభ్యదేశాలకు వారి దేశీయ సర్వీసుల, మదుపు రంగాల భవిష్యత్తులో 5 సం॥ల వ్యవధిలో మినహాయింపు లివ్వటానికి ఇండియా అంగీకరించింది. భారతదేశం స్వచ్ఛందంగా తన దేశీయ విధానంలో భవిష్యత్తులో చేయబోయే మార్పులు, ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్యానికి లోబడి విధాన నిర్ణయం తీసుకున్న 5 సం॥వరకు అమలులో వుంటాయి. దీనిని వ్యాపార పరిభాషలో రాఛెట్‌గా వ్యవహరిస్తున్నారు. భారతదేశం మోస్ట్ ఫేవర్డ్ నేషన్ (ఎంఎఫ్ఎన్) పేరిట తన వ్యాపార భాగస్వామికి భవిష్యత్ పెట్టుబడులను, సేవల రంగానికి సంబంధించిన రాయితీలను ఇవ్వటానికి అంగీకరించిన ద్వైపాక్షిక ఒప్పందం ఏవిధమైన కాలవ్యవధి లేకుండా ఆర్సెప్ సభ్యదేశాలకు కూడా వర్తిస్తుంది.

వాణిజ్య మంత్రిత్వశాఖ అధికారి ఒకరు దీనిపై మాట్లాడుతూ "పెట్టుబడుల విభాగంలో అభివృద్ధి చోటుచేసుకుంది. సవరణ ప్రతిపాదించిన తర్వాత 5 సం॥వరకు దాని ప్రభావం ఉండేటట్లుగా మేము రాఛెట్‌ను ప్రతిపాదించాం" అన్నారు. (అసిత్‌రంజన్ మిశ్రా-లైవ్‌మింట్ 6-9-2017).

ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాస్వామ్యానికి సంబంధించిన చర్చల్లో వెల్లడైన భయాలు నిజ మయ్యాయి. భారత ప్రభుత్వం 80శాతం వస్తు దిగుమతులపై పన్నులను సున్నా స్థాయికి తగ్గించి వేసింది. ఇది నాణ్యతలేని చౌకబారు వస్తువులతో మార్కెట్లను ముంచెత్తివేస్తుంది. ఇది వ్యవసాయ పారిశ్రామిక రంగాలలోని చిన్న ఉత్పత్తిదారులను నాశనం చేస్తుంది. ఇప్పటిదాకా వాళ్ళే భారత ఆర్థికానికి కీలకమైన వాళ్ళుగా వున్నారు. సెప్టెంబరు 2016 వరకు 25 శాతంగా వున్న గోధుమల దిగుమతి సుంకాన్ని 2016 డిసెంబరులో ప్రభుత్వం పూర్తిగా రద్దుచేసింది. చక్కర, ముడిచక్కెరలపై, పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని కనిష్ఠస్థాయికి తగ్గించివేసింది.

ఆర్సెప్ సభ్యదేశాలతోపాటు, యూరోపియన్ యూనియన్, అమెరికా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియాలు కూడా భారతదేశం సుంకాలు తగ్గించటంద్వారా వ్యవసాయోత్పత్తుల మార్కెట్టును బహిరంగ మార్కెట్టుగా వుంచాలని, దిగుమతులకున్న అడ్డంకులను ఎత్తి వేయాలని, బయోటెక్నాలజీలో వస్తున్న అభివృద్ధికర మార్పులను వేగంగా అందుకోవాలని అంటే జన్యుమార్పిడి వంగడాలను స్వీకరించాలని ఒత్తిడి పెడుతున్నాయి. ఈ సంవత్సరం అర్జెంటీనాలో జరగబోయే ప్రపంచ వాణిజ్యసంస్థ మంత్రివర్గ చర్చల్లో దీని గురించిన నిర్ణయం తీసుకుంటారని భావిస్తున్నారు. మోన్‌శాంటోతో సహా అనేక బహుళజాతి కంపెనీలు తమతమ దేశాలపై తీవ్ర ఒత్తిళ్ళను తీసుకువచ్చి భారతదేశంపై వాటిద్వారా ఒత్తిడి తీసుకురావటానికి తీవ్రప్రయత్నం చేస్తున్నాయి. మోన్‌శాంటోకు చెందిన బిటి-2 పత్తి విత్తనాలు భారతదేశ అనుమతికొరకు ఎదురు చూస్తున్నాయి. భారతదేశంలో బిటి పత్తిసాగు తీవ్రంగా తగ్గిన నేపథ్యంలో మోన్‌శాంటో, ఇంకా ఇతరులు భారతదేశంపై ఒత్తిడి పెంచటాన్ని గమనించాలి.

ఇప్పుడు ఆర్సెప్‌లో భారతదేశం అంగీకరించిన అనేక డిమాండ్లు ఏవిధమైన మినహాయింపులు లేకుండా ఆర్సెప్‌కి వెలుపల వున్న దేశాలకు ఎంఎఫ్ఎన్ నిబంధన క్రింద వర్తిస్తాయి. మనదేశానికి సానుకూలంగా వుండేట్లు ఆర్సెప్‌లో ప్రభుత్వం పోరాడుతుందని సురేష్‌ప్రభు చెప్పటం, మసిబూసి మారేడుకాయ చేయటానికే. సామ్రాజ్యవాదానికి దాసోహమవటం తప్ప, ఒక దళారీ బూర్జువా నుంచి ఇంకేం ఆశించగలం?!

oooooo